ప్రజాశక్తి
గురువారం 6 నవంబర్ 2025
5
అల్లూరి సీతారామరాజు



ఖండ్రుమ్‌లో 'పరివర్తన'

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని ఖండ్రుమ్ పంచాయతీ కేంద్రంలో స్థానిక పోలీస్ శాఖ ఆధ్వర్యాన బుధవారం పరివర్తన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ హిమగిరి మాట్లాడుతూ, గిరిజనులు, యువత గంజాయి, మద్యం, గుట్కా, సిగరెట్ వంటి చెడు అలవాట్ల జోలికి పోవద్దు అన్నారు. గంజాయి తరలించి బంగారు భవిష్యత్‌ను పోగొట్టు కోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కె పాపీనాయుడు, సర్పంచ్, సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షుడు కె హరి, వైస్ ఎంపీపీ ఎస్ ఆనంద్, గిరిజనులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోలీసులు

మాతా శిశు మరణాలపై అప్రమత్తంగా ఉండండి

ఇన్‌ఛార్జి జెసి, ఐటిడిఎ పిఒ శ్రీ పూజ



ప్రజాశక్తి-పాడేరు టౌన్: మాతా, శిశు మరణాలు సంభవించకుండా జిల్లా ఆరోగ్య శాఖాధికారులు అప్రమత్తంగా ఉండాలని ఇన్చార్జి జాయింట్ కలెక్టర్, ఐటిడిఎ పిఒ తిరుమణి శ్రీ పూజ స్పష్టం చేశారు. మాతా శిశు మరణాలు, ఇతర అంశాలపై ఆరోగ్య శాఖాధికారులతో బుధవారం ఐటిడిఎలో వీడియో కాన్ఫరెన్స్ లో సమీక్షించారు. సికిల్ సెల్ ఎనీమియా స్క్రీనింగ్ టెస్ట్‌ల సంఖ్యను పెంచాలని మరణాలను తగ్గించడంపై దృష్టి సారించాలన్నారు. గర్భిణీ స్త్రీలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పిహెచ్‌సి పోర్టల్‌లో గర్భిణీల రిజిస్ట్రేషన్ లు పూర్తి చేయాలని ప్రభుత్వం కల్పించిన వైద్య సదుపాయాలు తప్పనిసరిగా అందించాలన్నారు. యాంటినాటల్ కేర్ పరీక్షలను నిర్వహించి ప్రారంభంలోనే అనారోగ్య సమస్యలను గుర్తించి చికిత్స అందించాలని సూచించారు. పిల్లలలో సంక్రమించే మీజిల్స్, గవదబిల్లలు, రుబెల్లాను గుర్తించి ఎంఎంఆర్ టీకా ఇప్పించి ప్రాణాపాయం నుంచి కాపాడాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలకు, బాలింతలకు పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. ఐటిడిఎ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత, ఆశ్రమ పాఠశాలల్లోని కిశోర బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఆరోగ్య సమాచారాన్ని నమోదు చేయాలని ఆరోగ్య, స్త్రీ శిశు సంక్షేమ అధికారులను ఆదేశించారు. సిడిపిఒలు క్షేత్ర స్థాయి పర్యటనలు చేసి అంగన్‌వాడీలలో టీకాలు, సంపూర్ణ పోషణ మెనూ అమలు, స్టాక్, రికార్డులను పరిశీలించాలని ఆదేశించారు. ఫీడర్, 108, 104 అంబులెన్స్‌లను 24 గంటలూ సిద్ధంగా ఉంచాలని, ఆరోగ్య కేంద్రాల్లో మందులు, టెస్టింగ్ కిట్‌లను అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. జిల్లాను మలేరియా రహిత ంగా మార్చడానికి ఫాగింగ్, స్ప్రేయింగ్ నిరంతరం చేపట్టాలన్నారు. మురుగు కాలువలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, దోమ తెరలు వాడేలా ప్రజలను ప్రోత్సహించా లన్నారు. పుట్టిన పిల్లలకు ఆధార్, జనన ధృవీకరణ పత్రాలు సకాలంలో మంజూరు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ వెంకటేశ్వర్లు, డిఎంహెచ్ఒ కృష్ణమూర్తి నాయక్, ఐసిడిఎస్ పిడి ఝాన్సీ రామ్‌పడాల్, జిల్లా మలేరియా అధికారి ఎం.తులసి పాల్గొన్నారు.


నేటి నుంచి కాఫీ కార్మికుల సమ్మె



మాట్లాడుతున్న సుందరరావు

ప్రజాశక్తి -పాడేరు : ఏపీ ఎఫ్ డిసి కాఫీ తోటల్లో పని చేస్తున్న కార్మికులు ఈనెల6న గురువారం నుంచి చేపట్టే సమ్మెలో భాగంగా ఏపీ ఎఫ్ డి సి డివిజనల్ మేనేజర్ ఆఫీసు ముందు ఆందోళన కార్యక్రమాలు కార్యక్రమాలు చేపట్టాలని కాఫీ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు ఎల్ సుందరరావు పిలుపునిచ్చారు హెల్పర్స్, కార్మికుల తో కలిసి గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాఫీ కార్మికుల సమస్యలు ఇప్పటి వరకు పరిష్కరించనందున సమ్మె అనివార్య మైందన్నారు. ప్రధానంగా సంస్థను కాపాడుకొనే ప్రయత్నంలో భాగంగానే సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. 2024 నవంబర్లో జరిగినా ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు.

ఏపీ ఎఫ్డిసి సంస్థలో గతంలో కింద స్థాయి నుండి పై స్థాయి వరకు సుమారుగా 350 మంది వివిధ స్థాయిలో సిబ్బంది ఉండేవారని. క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించే(పనులు చేయించే) దాంట్లో ప్రధానంగా ప్లాంటేషన్ కండక్టర్స్ 90 మంది వరకు ఉండేవారని తెలిపారు. ఇప్పుడు కేవలం నాలుగురు, ఐదుగురు మాత్రమే ప్లాంటేషన్ కండక్టర్స్ ఉన్నారని తెలిపారు. రిటైర్మెంట్ అవుతున్నా పోస్టులు భర్తీ జరగ లేదన్నారు. హెల్పర్స్ పేరుతో 2010 లో 18 మందిని నియామకం చేపట్టి కనీస వేతనంలో ఇవ్వకపోగా వల్ల కష్టాని దోచుకొంటున్నారు.ప్రమోషన్స్ ఇవ్వకపోగా, కనీసం క్షేత్రస్థాయిగా ఉన్నటువంటి పోస్టులైన ప్లాంటేషన్ కండక్టర్స్‌ను కూడా నియమించకపోవడంతో ఉన్న హెల్పర్స్‌పై పని భారం పెరగడమే కాకుండా 90 మంది ఉండవలసినటువంటి ప్లాంటేషన్ కండక్టర్స్ కేవలం హెల్పర్స్ తో కలిపి 25 మందితో మాత్రమే సుమారుగా 3 వెళ్ల హెక్టార్లను క్షేత్రస్థాయి పనులు చేపించుకొని కష్టాన్ని యాజమాన్యం దోచుకుంటుందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా గత అక్టోబర్ నుంచి పెరిగినటువంటి విడియే పాయింట్లు ప్రకారం రోజువారి కూలి రేట్లు పెంచాలని, పండ్ల సేకరణ రేట్లు పెంచాలని ఆందోళన చేపడుతున్నట్లు తెలిపారు.



ఖాళీగా ఉన్న కుర్చీలు

ఎంపిపిపై అవిశ్వాస తీర్మానం రద్దు

-సమావేశానికి హాజరు కాని ఎంపిటిసిలు

ప్రజాశక్తి-హుకుంపేట:హుకుంపేట మండల ఎంపీపీగా కూడ రాజు బాబు మళ్లీ పదవిలో కొనసాగనున్నారు. ఆయనపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం విఫలమైంది. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలో సర్పంచ్‌గా, తరువాత ఎంపీటీసీగా గెలిచి కొనసాగిన రాజుబాబు, అనంతరం మండల పరిషత్ అధ్యక్షుడిగా (ఎంపీపీ) బాధ్యతలు స్వీకరించారు.ఇటీవలి కాలంలో ఎంపీపీ కూడ రాజు బాబు పై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన సూకూరు ఎంపీటీసీ కిలగాడ సింహచలం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. పార్టీ అంతర్గత విభేదాల కారణంగా ఈ వ్యవహారం నెలల తరబడి సాగింది.

గత నెలలో ఎన్నికల అధికారిగా వ్యవహరించిన స్పెషల్ ఆఫీసర్ కేపీ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవిశ్వాస సమావేశం రద్దయింది. తాజాగా బుధవారం ఎన్నికల అధికారిగా ఆర్.ఓ., ఆర్.డీ.ఓ లోకేశ్వరరావు హుకుంపేట ఎంపీడీవో కార్యాలయంలో అవిశ్వాస ఎన్నికలు నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు సభ్యులకు అవకాశం ఇచ్చారు. నిర్ణీత సమయానికి ఒక్క ఎంపీటీసీ సభ్యుడు కూడా హాజరు కాకపోవడంతో, అవిశ్వాస తీర్మానం స్వయంగా రద్దయింది. దీంతో రాజు బాబు మళ్లీ హుకుంపేట మండల ఎంపీపీగా కొనసాగడానికి మార్గం సుగమమైంది.

ఫలించిన సిపిఎం పోరాటం

- గూడెం గ్రామానికి విద్యుత్ వెలుగులు
- ఆనందంలో మునిగి తేలిన గిరిజనులు



కృతజ్ఞతలు తెలుపుతున్న గిరిజనులు

ప్రజాశక్తి -అనంతగిరి:స్వాతంత్రం వచ్చి ఏళ్లు గడుస్తున్నా నేటికీ చీకటి బతుకుల్లోనే జీవితాలు సాగించిన గిరిజనుల పక్షాన చేసిన సిపిఎం పోరాటం ఫలించింది. స్పందించిన జిల్లా విద్యుత్ ట్రాన్స్ కో ఉన్నతాధికారులు రంగంలోకి దిగి విద్యుత్ సౌకర్యం కల్పించడంతో ఆదివాసి గిరిజనులు ఆనందంతో డప్పుల తో థింసా నృత్య కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులకు చేతులు జోడించి కృతజ్ఞతలు తెలిపారు.

మండలానికి మారుమూల నాన్ షెడ్యూల్ రొంపల్లి పంచాయతీ గూడెం గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని గత కొనేళ్ళుగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.గోవిందరావు పంచాయతీ వార్డు మెంబర్ సోమెల. అప్పలరాజు ఆధ్వర్యంలో గ్రామస్తులు అనేక రూపాలలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎత్తైన కొండలు దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న గూడెం గ్రామానికి విద్యుత్ సౌకర్యం లేక ఆ గ్రామానికి చెందిన 20 కుటుంబాలు రాత్రుల సమయంలో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సిపిఎం చేసిన పోరాట ఫలితంగానే జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీరింగ్ జీన్ ప్రసాద్ బృందం గత నెల 11 తేదీన గూడెం గ్రామాన్ని సందర్శించింది. నెల రోజుల్లో విద్యుత్ సౌకర్యం కల్పించడానికి హమి ఇచ్చారు. అందులో భాగంగానే మంగళవారం విద్యుత్ శాఖ అదికారులు లైన్ వేసి ఇల్లులు, .వీధిలలో దీపాలు వెలిగించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-పెదబయలు : రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు పెదబయలు గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థి పాతుని చంటిబాబు ఎంపికయ్యాడు. ఈ నెల 4న కైలాసగిరిలో జరిగిన జిల్లా స్థాయి 800 మీటర్ల పరుగుల పందెంలో చంటిబాబు ప్రతిభ చూపి ద్వితీయ స్థానం సాధించడడంతో రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. ఈ మేరకు చంటిబాబును ప్రిన్సిపాల్ డిఎస్ సూర్య శంకరావు, పిడి గిరి వరప్రసాద్, పిఇటి డి.రాంబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.అలాగే సీకరి గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల నుండి అండర్- 19 విభాగంలో డిస్కస్ త్రో, షాట్ పుట్‌లో కిల్లో రాజు, అండర్ 17 విభాగంలో జావెలిన్ త్రోలో కిరసాని బాబూజీ ప్రతిభ కనబర్చి శ్రీకాకుళం జిల్లాలో ఈ నెల 8, 9 తేదీల్లో జరుగు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

విద్యారంగ సమస్యలపై ఉధృత పోరాటం

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ మండల మహాసభ బుధవారం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కార్తీక్ శ్రీను అధ్యక్షతన నిర్వహించారు . ఈ మండల మహాసభల్లో మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం ఎం శ్రీను , రాందాస్, ఈశ్వరి , విజయ లక్ష్మి హాజరయ్యారు. మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీను మాట్లాడుతూ, విద్యార్థుల హక్కులు, సమస్యల పరిష్కార దిశగా ఎస్ఎఫ్ఐ పోరాటం చేస్తుందన్నారు. సమస్యల కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ మంజూరు చేయాలన్నారు.ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు రామదాసు మాట్లాడుతూ, విద్యార్థి దశ నుండి నాయకుని లక్షణాలు కలిగి ఉండడం చాలా ప్రాముఖ్యమన్నారు.

మండల అధ్యక్ష కార్యదర్శులు ఎన్నిక

ఈ మహాసభల్లో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు పవన్ చంద్, కార్యదర్శి భాస్కర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకోన్నారు. ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షుడుగా చరణ్, జాయింట్ సెక్రెటరీగా సోమేశ్, మండల కన్వీనర్ మమిత, కో కన్వీనర్లుగా ప్రియ, మల్లేశ్వరి, కౌసల్యలు ఎన్నికయ్యారు. నూతనంగా నియమితులైన ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు ప్రసంగిస్తూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తలెత్తిన ప్రధాన సమస్య ప్రహరి గోడ, మరుగుదొడ్ల నిర్మాణాలు, రన్నింగ్ వాటర్, తాగునీటి సమస్య పరిష్కారానికై కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సభ్యులు సరస్వతి, సరోజిని, నితీసా, స్వాతి, విష్ణువర్ధన్, రామ్ చరణ్ అరుణ్ కుమార్, బంద, సుకుదేవ్, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎన్నికైన నూతన కార్యవర్గం సభ్యులు, విద్యార్థులు

భీష్మారావు ఆశయ సాధనకు పోరాటాలు

- ఐద్వా తెలంగాణ నాయకురాలు హైమావతి
- భీష్మారావుకు పలువురు నివాళులు

ప్రజాశక్తి -చింతూరు: బత్తుల భీష్మారావు ఆశయ సాధనకై ఉద్యమించాలని ఆయన భార్య హైమావతి పిలుపునిచ్చారు. భీష్మారావు వర్ధంతి సందర్భంగా చింతూరు మండల కేంద్రంలో శ్యామల వెంకటరెడ్డి భవన్‌లోని భీష్మారావు స్మారక స్థూపం వద్ద పలువురు నివాళులర్పించారు. సిపిఎం చింతూరు మండల కమిటీ, కుటుంబ సభ్యులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, భార్య హైమావతి, కుమారుడు లెనిన్, కుమార్తె, అన్నదమ్ములు కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భీష్మారావు భార్య హైమావతి (తెలంగాణ ఐద్వా నాయకురాలు) మాట్లాడుతూ 1985లో ఏజెన్సీలోని పేద ప్రజల దోపిడీపై ప్రజలను చైతన్యవంతం చేస్తూ సిపిఎం పోరాటాలతోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని నమ్మి ప్రజలను పోరాటాల వైపు మళ్ళించి నాయకుడిగా భీష్మారావు నిలిచిపోయారని, నేటికీ ఈ ప్రాంతం అభివద్ధిలో ఆయన చిరస్మరణీయుడుగా ఉన్నారన్నారు. ఈనాటి పాలకుల ప్రైవేటీకరణ విధానాలపై ప్రజలను చైతన్యవంతం చేసి ఈ ప్రాంత ఆదివాసీ హక్కులకు పోరాటాలకు న్యాయం జరిగే విధంగా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కేంద్రంలోని బిజెపి దేశంలో ప్రజాసంపదను ప్రైవేటు వ్యక్తులకు దారా దత్తం చేస్తున్నారని ధ్వజమెత్తారు. పాలకుల వినాశకర విధానాలపై ప్రజలను చైతన్యం చేయటమే భీష్మారావుకి నిజమైన నివాళి అన్నారు. సిపిఎం జిల్లా నాయకులు పల్లపు వెంకట్, సీసం సురేష్, కుటుంబ సభ్యులు బత్తుల లెనిన్, కుమార్తె సృజన, అల్లుడు మహేందర్, అన్నదమ్ములు సిపిఎం మండల కమిటీ సభ్యులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, రంగమ్మ, లక్ష్మణ్, కారం సుబ్బారావు, మడకం సిన్నయ్య మల్లం సుబ్బమ్మ, పిడగయ్య, చింతా రాంబాబు, బివి రమణ, సోడి చిన్నామి కమల, తదితరులు పాల్గొన్నారు.



భీష్మారావు స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు, పలువురు నేతలు

కూనవరం : మండలంలోని శ్రీమార్త శ్రీరాంమూర్తి భావన్ లో బత్తుల భీస్మారావు వర్ధంతి, ఆవుల నాగమయ్య వర్ధంతిని నిర్వహించారు. ఆవుల నాగమయ్య చిత్రపటానికి సిపిఎం మండల కార్యదర్శి బాబుబొర్రయ్య పూలమాల వేసి నివాళి అర్పించారు. బత్తుల భీష్మారావు చిత్రపటం వద్ద సీనియర్ నాయకులు తలగాని నాగరాజు నివాళి అర్పించారు. జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరావు మాట్లాడుతూ నాగమయ్య 4 సార్లు సొసైటీ ప్రెసిడెంట్‌గా చేసారని 1 సారి వైస్ ఎంపిపిగా పనిచేసారని గుర్తు చేసారు. అటవీ హక్కుల చట్టాల కోసం పోరాడారన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరావు, పాయం సీతారామయ్య, మడకం నాగమణి గడ్డిపాటి షణ్ముకేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి

- సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయండి
- సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

ప్రజాశక్తి - విఆర్‌పురం: ప్రభుత్వ రంగ కార్మికులకు కనీస వేతనం.అమలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. విఆర్‌పురం మండలంలోని రేఖపల్లిలో సిఐటియు 9వ మహాసభ సిఐటియు మండల అధ్యక్షులు కనకమహాలక్ష్మి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ సభ్యులు సున్నం రంగమ్మ జెండా ఆవిష్కరించారు. అనంతరం సిఐటియు జిల్లా కార్యదర్శి పల్లపు వెంకట్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడా పెట్టుబడిదారులకు రాయితీ బ్యాంకులు తీసుకున్న వారికి రుణాలు సహకరిస్తున్నాయి కానీ ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వడం లేదన్నారు. స్కీం పర్చర్లు ప్రభుత్వ ఉద్యోగులకు సమానంగా పనిచేస్తున్నా కనీసం వేతనాలు పెంచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విఆర్ఎ, మిడ్‌డే మీల్స్, ఆశ, ఫీల్డ్‌అసిస్టెంట్, అన్నిరంగాల కార్మికులందరినీ ఐక్యం చేసి కనీస వేతనాలు సాధించే వరకూ పోరాడుతామని హెచ్చరించారు. ఆల్ ఇండియా సిఐటియు మహాసభలు మహాసభలు విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు ఉంటాయని మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు విఆర్ పురం మండల కన్వీనర్‌గా గొర్రె రాజు, కో కన్వీనర్ గా ముసురు రాజేశ్వరి, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మరో 27 మందితో కమిటీని ఎన్నుకున్నారు. అంగన్‌వాడీ, ఆశ, మిడ్ డే మిల్స్ శానిటైజర్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు..

వై.రామవరం: సిఐటియు మహాసభ తోటకూరపాలెంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మట్ల శ్రీవాణి, మాట్లాడుతూ మండలంలో నూతన కమిటీ ఎన్నుకున్నామన్నారు. మండల కన్వీనర్ కె.శాంతరాజు, కో కన్వీనర్ బేబీ రాణి, 25 మంది సభ్యులు ఎన్నుకున్నారు. స్కీం వర్కలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో సమానంగా పనిచేస్తున్న సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు, వీరలక్ష్మి, వరుణ్, తదితరులు పాల్గొన్నారు,



జెండాను ఆవిష్కరిస్తున్న సీనియర్ సభ్యులు సున్నం రంగమ్మ



సిఐటియు విఆర్‌పురం మండల కన్వీనర్ రాజు, కో కన్వీనర్ రాజేశ్వరి

రహదారి సమస్య పరిష్కరించమంటే కేసులా?

- అయినా భయపడేది లేదు, ఉద్యమం కొనసాగిస్తాం
- ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామారావు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: గొంటివానిపాలెం రహదారి సమస్య పరిష్కారం కోసం ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు ఆధ్వర్యంలో గిరిజన సంఘాలు ప్రజాప్రతినిధులు సెప్టెంబరు 12న ధర్నా నిర్వహిస్తే సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన అధికారులు ఇప్పుడు తమ అందరిపై అక్రమ కేసులు బనాయించడం సరికాదని లోతా రామారావు అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ కేసులకు భయపడేది లేదని, ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఆయనతో పాటు మండల కార్యదర్శి, జిల్లా నాయకులు కొండ్ల సూరిబాబు మాట్లాడారు. ఏలేశ్వరం మండలం జె.అన్నవరం నుండి రమణయ్యపేట వరకూ రహదారి అధ్వానంగా తయారైందని దీనిపై ధర్నా, వంటా, వార్పు కార్యక్రమం నిర్వహించామన్నారు. అడ్డతీగల పోలీస్‌స్టేషన్‌లో పలు సెక్షన్ల క్రింద కేసు నమోదు చేసినట్లు అడ్డతీగల ఎస్ఐ వినోద్ తెలిపారన్నారు. చికిలింత సర్పంచ్ కొండ్ల సూరిబాబు, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, గిరిజన సంఘం నాయకులు జర్తా రాజు, పాండవులు సత్యనారాయణ, కోసూరి అప్పలరాజు తదితరులు 18 మందికి నోటీసులు జారీ చేశారన్నారు. రహదారి సమస్య పరిష్కారానికి త్వరలో మరో ఉద్యమం చేపడతామని, ధర్నా కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని సూరిబాబు కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నేతలు పాల్గొన్నారు.



నోటీసులు తీసుకుంటున్న లోతా రామారావు

గురుకుల పాఠశాల సమస్యలపై నివేదిక

కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ జెఇ పాఠశాల సందర్శన

ఉన్నతాధికారులకు అంచనా ప్రతిపాదన

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరు ఎపి గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలపై అక్టోబర్ 28వ తేదీన 'ప్రజాశక్తి' అల్లూరి జిల్లాలో సం'క్షామ' వసతిగృహాలు శీర్షికన కథనం ప్రచురితమైంది. వసతి గృహంలో టాయిలెట్స్, తాగునీటి సౌకర్యం లేకపోవడం, శిథిలావస్థలో ఉన్న డైనింగ్‌హాలు వంటి సమస్యలు వెలుగులోకి తీసుకురావడం జరిగింది. స్పందించిన జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ పూర్తిస్థాయిలో పరిశీలించి నివేదిక అందజేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ జెఇ కళ్యాణ్‌రావు, సీలేరు సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ రాంబాబు బుధవారం గురుకుల పాఠశాలను సందర్శించారు. టాయిలెట్స్, స్నానపు గదులు పరిశీలించి వాటికి నీటి సౌకర్యం ఉందా లేదా అనే విషయం క్షుణ్ణంగా పరిశీలించారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రిన్సిపాల్ బుచ్చిబాబు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జెఇ కళ్యాణ్‌రావు 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ కలెక్టర్, తమ పై అధికారుల ఆదేశాల మేరకు గురుకులంలో సమస్యలపై అధ్యయనం చేశామని, తమ పరిశీలనలో స్నానపు గదులు, టాయిలెట్స్‌కు పైప్‌లైన్ ద్వారా నీరు సరఫరా నిలిచిపోయిందని, ప్రస్తుతం విద్యార్థులు స్నానం చేస్తున్న నీటి కుండీ పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని తెలిపారు. ఇంకా పలు సమస్యలు ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసు కున్నామన్నారు. సమస్యలపై ఎస్టిమేట్ జిల్లా కలెక్టర్‌కు నివేదిక రూపం లో అందజేస్తామని జెఇ తెలిపారు. కార్యక్రమంలో సీలేరు సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ రాంబాబు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బుచ్చిబాబు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నీళ్లకుండీని పరిశీలిస్తున్న జెఇ కల్యాణ్‌రావు

మొక్కల పెంపకం

ప్రజాశక్తి -కొయ్యూరు: జాతీయ ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకంలో ఈ ఏడాది ఇంతవరకూ 904 ఎకరాల్లో వివిధ మొక్కలను నాటే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ప్రసాద్, ఎన్ఆర్‌జిఎస్ ఎపిఒ అప్పలరాజు తెలిపారు. మండలంలోని నడింపాలెంలో రైతులకు పంపిణీ చేసిన 2 ఎకరాల్లో 140 మొక్కలను నాటే కార్యక్రమాన్ని సర్పంచ్ రాజబాబు ఆధర్యంలో పర్యవేక్షించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ రైతులు పండ్లతోటల పెంపకం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు.

వాలంటీర్ల రణభేరిని విజయవంతం చేయండి

ప్రజాశక్తి- జికె వీధి : గూడెంకొత్తవీధి మండలం గ్రామ, వార్డు వాలంటీర్లు పాడేరులో వాలంటీర్ల రణభేరి కార్యక్రమానికి పాల్గొవాలని గూడెం కొత్తవీధి మండలం రింతాడ గ్రామ వార్డ్ వాలంటీర్ల అధ్యక్షుడు, పీసా ఉపాధ్యక్షుడు గెమ్మెలి కోటిబాబు పిలుపునిచ్చారు. ఈ నెల 7వ తేదీన పాడేరులో జరిగే కార్యక్రమానికి మండలంలో వాలంటీర్లు అందరూ తరలిరావాలని వాలంటీర్లను మళ్ళీ విధుల్లోకి చేర్చుకునే వరకు పోరాటం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వార్డు వాలంటీర్ల కార్యదర్శి దేసగిరి మురళీమోహన్, శేషగిరి, ముత్తుబాబు, గోపాలకష్ణ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు రీ-నోటిఫికేషన్

ప్రజాశక్తి-పాడేరు: రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కమిషనర్ (విజయవాడ) ఆదేశాల మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మద్యం దుకాణాల నిర్వహణకు రీ నోటిఫికేషన్ వెలువడిందని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి. ఆర్.గౌరీశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నవంబర్ 10 వరకు దరఖాస్తులకు గడువు ఉందని తెలిపారు. జి.మాడుగుల మండలంలో మద్యం దుకాణం నిర్వహణకు గాను అధికారులు రీ-నోటిఫికేషన్ జారీ చేశారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ దుకాణం నిర్వహణ కోసం జరుగు ఆక్షన్‌లో (వేలం) పాల్గొనాలని కోరారు. ఇందుకోసం, వేలంలో పాల్గొనేవారు తిరిగి చెల్లించబడని రూ.2,00,000 (రెండు లక్షల రూపాయలు) చలానా ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తులు సమర్పించడానికి చివరి తేదీ నవంబర్ 10, 2025 సాయంత్రం 5 గంటల వరకు అని గౌరీశ్వరరావు పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ అవకాశం వినియోగించుకోవాలని, ఆక్షన్‌కు సంబంధించిన ఇతర పూర్తి వివరాల కోసం పాడేరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.



సంతకాల సేకరణ చేపడుతున్న ఎమ్మెల్యే

వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై సంతకాల సేకరణ

ప్రజాశక్తి-చింతపల్లి : ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గురువారం వైసిపి మండల అధ్యక్షుడు పాంగి గణబాబు ఆధ్వర్యంలో స్థానిక ముత్యాలమ్మ ఆలయం ఆవరణంలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఇందులో పాల్గొన్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో పేదవాడు వైద్య కళాశాలలో ఉన్నత చదువు చదివి పేద రోగులకు సేవ చేయడం కూటమి ప్రభుత్వానికి ఇష్టం లేదని, పేదవాడి రక్తం తాగడానికి కంకణం కట్టుకున్నారని ఆరోపించారు. ప్రజా నిధులతో నిర్మించిన వైద్య కళాశాలలను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కోరాబు అనూష దేవి, జడ్పిటిసి పోతురాజు బాలయ్య, సర్పంచ్ దురియా పుష్పలతో, వైసిపి నాయకులు జల్లి సుధాకర్, జల్లి హలియా రాణి, లోచలి వరప్రసాద్, ఎంపిటిసి సభ్యులు సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-అనంతగిరి: గూడెంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జనసేన పార్టీ ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. బుధవారం గ్రామంలో సందర్శించిన ఆయన గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ, గ్రామానికి కనీసం మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని తెలపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం గిరిజన ప్రాంతం అభివృద్ధికి పెద్ద పీట వేస్తుందని అన్నారు. గ్రామానికి రోడ్డు, పాఠశాల, అంగన్వాడి భవనాల ఏర్పాటుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారాన్ని కృషి చేస్తానని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు చిట్టం. మురళి శెట్టి .చిరంజీవి. పి .లక్ష్మణ గ్రామస్తులు పాల్గొన్నారు

పిల్లిపుట్టుకు బిటి రోడ్డు నిర్మించాలి

ప్రజాశక్తి- పెదబయలు : పెదబయలు మండలం పోయిపల్లి పంచాయతీ పరిధి పోయిపల్లి గ్రామం నుంచి పంచాయతీ కార్యాలయం మీదుగా పిల్లిపుట్టు గ్రామం వరకు బిటి రోడ్డును నిర్మించాలని ట్రైబల్ రైట్స్ ఫోరమ్ జిల్లా అధ్యక్షులు సతీష్ కుమార్ పోయిబరెడ్డి డిమాండ్ చేశారు. పిల్లిపుట్టు వయా సున్నం కల్లం మిల్లిమిచ్చికలా మామిడి మీదిగా కొరవంగి రూడకోట వెళ్ళుటకు బిటిరోడు నిర్మించాలని కోరారు. దీనిపై గతంలో జాయింట్ కలెక్టర్‌ను కోరినట్లు చెప్పారు. ఈ కనక్టివిటీ బిటి రోడ్డు వేయడం ద్వారా పోయిపల్లి, బొండపల్లి, అటువైపు కొరవంగి, కుమాడా, రూడకోట పంచాయతీ ప్రజలకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు.

హోం టూరిజం అభివృద్ధికి కృషి

కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్

ప్రజాశక్తి- పాడేరు: జిల్లాలో హోం పర్యాటకాన్ని విజయవంతం చేయడానికి జిల్లా యంత్రాంగం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం ఐటిడిఏ పాడేరు సమావేశ మందిరంలో హోం స్టేల నిర్వాహకులతో జరిగిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ అఫైర్స్, పీఎం జుగా పథకం కింద జిల్లాలో ఇప్పటికే 150 గృహాలకు హోం స్టే ఏర్పాటుకు అనుమతులు లభించాయని కలెక్టర్ తెలిపారు. నబిట్ లక్షం గడవ ఉన్న జిల్లాలో 40 వేల హోం స్టేలు ఏర్పాటు చేసే విధంగా జిల్లా యంత్రాంగం ప్రణాళికలు రూపొందిస్తోందని వెల్లడించారు. అరకు రీజియన్‌లో పర్యాటకాన్ని ప్రోత్సహించి, ఈ ప్రాంత ప్రజలకు జీవనోపాధి కల్పించేందుకు ముఖ్యమంత్రి ఒక పాలసీ రూపంలో తీసుకురావడం గొప్ప విషయమన్నారు. హోం స్టేల ఏర్పాటులో ఎదురయ్యే ఆర్థిక సమస్యలను అధిగమించడానికి ప్రభుత్వం పలు రాయితీలు కల్పిస్తోందని. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా రాయితీతో కూడిన రుణాలు ఇప్పించడం జరుగుతుందన్నారు. హోం స్టేను ఎంఎస్ఎంఇ పరిశ్రమగా పరిగణించి, ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారంటీ స్కీమ్ కింద పరిశ్రమల శాఖ ద్వారా 35 శాతం రాయితీ లభిస్తుందన్నారు. ప్రభుత్వ అనుమతి ఉన్న హోం స్టేలకు పెట్టుబడిలో 5 శాతం రాయితీ లభిస్తుందన్నారు. హోం స్టేపై పెట్టిన పెట్టుబడి రెండు సీజన్లలోనే తిరిగి వస్తుందని, నిర్వాహకులు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దన్నారు.

ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్, ఐటిడిఏ పీవో తిరుమణి శ్రీ పూజ మాట్లాడుతూ,



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

హోం స్టేల ద్వారా ఈ ప్రాంత గిరిజన ప్రజల ఆహార వ్యవహారాలు, జీవన విధానాలు, ఆహార పద్ధతులు పర్యాటకులకు తెలుస్తాయని తెలిపారు. తద్వారా స్థానిక ప్రజలకు మెరుగైన ఆర్థిక పరిస్థితులు లభిస్తాయని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రైవేటు బస్సుల కసరత్తులు... హోం స్టే స్టేట్ నోడల్ ఆఫీసర్ వై. ప్రసన్న లక్ష్మి మాట్లాడుతూ, హోం స్టే మంజూరుకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, సాంకేతిక సమస్యల పరిష్కారానికి పర్యాటక శాఖ ఆధ్వర్యంలో టెక్నికల్ టీమ్ పనిచేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి దాసు, డీఆర్‌డీఏ పీడీ మురళి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి బలోపేతానికి ప్రతిపాదనలు

విజయనగరం ఆర్‌టిసి రీజినల్ చైర్మన్ దొన్నుదొర



సమావేశానికి హాజరైన దొన్నుదొర

ప్రజాశక్తి హుకుంపేట: ఆర్టీసీ సంస్థలో ఉన్న సమస్యలు, ఉద్యోగ భద్రత, ఉపాధి అవకాశాలు వంటి అంశాలపై చర్చించడం జరిగిందని విజయనగరం ఆర్‌టిసి రీజనల్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర తెలిపారు. ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకల నారాయణ ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలో ఆర్టీసీ బోర్డు సమావేశంలో పలు జిల్లాల ఆర్టీసీ రీజనల్ చైర్మన్‌లు పాల్గొనడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా దొన్నుదొర మాట్లాడుతూ, ఆర్టీసీ బలోపేతానికి సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించినట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ డిపోల రూపురేఖలు మార్చడం, కొత్త బస్సులు ప్రవేశపెట్టడం, సేవా ప్రమాణాలను మెరుగుపరచడం వంటి అంశాలపై కసరత్తులు చేస్తోందని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రైవేటు బస్సుల కంటే ప్రభుత్వ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం మరింత సురక్షితమని, ఇటువంటి ప్రయాణాలు ప్రమాదాలను తగ్గిస్తాయని ఆయన పేర్కొన్నారు. డ్రైవర్లు బస్సులను అతివేగంగా నడపకుండా, ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని నడపాలని సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. బస్సుల సురక్షిత ప్రయాణం కోసం పలు మార్గదర్శకాలు అమలు చేస్తున్నామని ఆయన వివరించారు. ఈ సమావేశంలో ఏపీఎస్ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, విజయవాడ రీజనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, నెల్లూరు రీజనల్ చైర్మన్ సురేష్ రెడ్డి, కడప రీజనల్ చైర్మన్ పూల నాగరాజు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో వంతెన నిర్మాణ పనులు

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి మండలం బెన్నవరం పంచాయతీ పరిధిలో వంతెన (బ్రిడ్జ్) నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. ఈ వంతెన నిర్మాణంపై జిల్లా కలెక్టర్‌ను బెన్నవరం సర్పంచ్ బచ్చేల సన్యాసమ్మ సోమవారం పాడేరు వెళ్లి కలిశారు. సర్పంచ్ అభ్యర్థనపై కలెక్టర్ వెంటనే స్పందించి బెన్నవరం గ్రామానికి బుధవారం వచ్చి స్థలాన్ని పరిశీలించారు. వంతెన పనులు త్వరితగతిన చేపట్టేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. గతేడాది ఈ బ్రిడ్జ్ నిర్మాణానికి రెండు కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు కలెక్టర్ గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు పూజారి నారాయణమూర్తి, మరిగల చంటిబాబు, పూజారి నాగేశ్వరరావు, వంతల రాజబాబు, కారేగి మత్స్యరాజు,ఉల్లి రమణ, సాంబశివ, గొల్లూర్ శంకర్రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు బస్ సర్వీసులు నడపాలి

- అల్లూరి జిల్లా వాసుల అభ్యర్థన

ప్రజాశక్తి-పాడేరు: విశాఖ ఉమ్మడి జిల్లా పరిధిలోని చోడవరం- వడ్డాది మధ్యలో కాజీవ్ డైవర్షన్ రోడ్డును పునరుద్ధరించడంతో పాడేరు బస్ సర్వీసులు నడపాలని జిల్లా వాసులు కోరుతున్నారు. ఈ రహదారిలోని కాజీవ్ వద్ద బుధవారం మధ్యాహ్నం నుంచి రాకపోకలు మొదలయ్యాయి. ఐదేళ్ళ కిందట ఇక్కడ వంతెన కూలిపోయింది. దీంతో అప్పటి నుంచి డైవర్షన్ రోడ్డు పైనే భారీ వాహనాలు సహా రాకపోకలు సాగిస్తున్నారు. ఇటీవల మొంథా తుఫాన్ కారణంగా ఈ డైవర్షన్ రోడ్డు మళ్లీ కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలు స్తంభించాయి. పాడేరు- విశాఖ మధ్య బస్ సర్వీసులు కూడా పూర్తిగా నిలిపివేశారు. దీంతో ముఖ్యంగా అల్లూరి జిల్లా వాసులతో పాటు ఈ సమీప చుట్టుపక్కల ప్రాంతాల వారికి చాలా నిర్బంధం కలిగించింది. ఈ వారం రోజులపాటు ఆటోలను ఆశ్రయించి లాంగ్ లైన్ లలో ప్రయాణాలు సాగించవలసి వచ్చింది. ప్రధానంగా దూర ప్రయాణం కావడంతో అల్లూరు జిల్లా వాసులు చాలా ఇబ్బందులు పడ్డారు. విశాఖపట్నం అనకాపల్లి ప్రాంతాల నుంచి పాడేరు వరకు గంటలు ప్రయాణం చేయాల్సిన పరిస్థితి వచ్చింది. ఎట్టకేలకు డైవర్షన్ రోడ్డు పూర్తి కావడంతో పాడేరు నుంచి విశాఖపట్నం అనకాపల్లి చోడవరం ప్రాంతాలకు బస్సులను పునరుద్ధరించాలని అల్లూరి జిల్లా వాసులు కోరుతున్నారు. వెంకన్నపాలెం నుంచి గరికబంద వరకు సుమారు 29 కిలోమీటర్ల రహదారి భారీ గుంతలతో గోతులతో ఉన్నందున తక్షణమే మరమ్మతులు చేపట్టాలని అనంతరం రోడ్డు అభివృద్ధి నిర్వహించాలని ఈ ప్రాంతంలో నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులు ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. సత్వరమే రోడ్డు అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.



ఆలయం వద్ద గిరిజనులతో పిఒ శ్రీపూజ

మత్స్య లింగేశ్వర ఆలయంలో పిఒ పూజలు

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని మఠం పంచాయతీ పరిధిలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మత్స్యగుండం మత్స్య లింగేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక ఏకౌర్ణమి సందర్భంగా బుధవారం తెల్లవారుజామున భక్తుల రద్దీ నెలకొంది. ఈ సందర్భంగా పాడేరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి, ఇంచార్జి జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. తదనంతరం మఠం సర్పంచ్ శాంత కుమారి, ఆలయ కమిటీ సభ్యులు కలిసి ప్రాజెక్ట్ అధికారిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి శ్రీ పూజ మాట్లాడుతూ, "మొదటిసారి స్వామివారిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నార. సీఐ సన్యాసి నాయుడు, ఎస్ఐ సూర్యనారాయణ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాంగి మత్స్యకొండ బాబు, మఠం సింహచలం నాయుడు, మఠం రామ్ బాబు, అంగనైని ఆనంద్, అల్లంగి బాలయ్య, చెట్టి హరినాథ్, ఉల్లి వెంకట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక పౌర్ణమి

ప్రజాశక్తి- చింతపల్లి : కార్తీక పౌర్ణమి సందర్భంగా చింతపల్లి మండలం కిటిమల పంచాయతీ బౌడ గ్రామంలోని శ్రీబౌడేశ్వర స్వామి వారి ఆలయంలో వైభవంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, బౌడ గ్రామస్తులు, చుట్టుపక్కల గ్రామాల భక్తులు వందల సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.



రోగులకు రొట్టెలు, పండ్లు అందిస్తున్న పాత్రికేయులు

రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ

ప్రజాశక్తి -కొయ్యూరు: రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యూజెఎఫ్) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గ్రూప్ సభ్యులు రాజేంద్ర పాలెం పిహెచ్‌సిలో బుధవారం రోగులకు రొట్టెలు, పండ్లు, మజ్జిగ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోగులకు సేవ చేశామన్న తృప్తి ఉందన్నారు. వైద్య సిబ్బంది కూడా వారి సేవా కార్యక్రమాన్ని అభినందించారు. కొయ్యురు ఎపిడబ్ల్యూజెఎఫ్ పాత్రికేయులు, వైద్యాధికారి, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం కొయ్యురు సిఐ శ్రీనివాస్, ఎస్ఐ కిషోర్‌వర్మ, తహసీల్దార్‌ను కలసి ప్రజాసమస్యలపై చర్చించారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి- విఆర్‌పురం: మండలంలోని రాజపేట పంచాయతీలోని సీతంపేట గ్రామానికి చెందిన కోట్ల రమణయ్య చెందిన ఇల్లు తన కూతురు ముత్యాల జయమ్మకు చెందిన ఇల్లు రెండూ బుధవారం షార్ట్ సర్క్యూట్‌తో కాలి బూడిదయ్యాయి. గ్రామస్తులు మంటలను అదుపుచేయడంతో గ్రామంలో మిగతా ఇళ్లకు ప్రమాదం తప్పింది. తెలుసుకున్న రెవెన్యూశాఖాధికారులు ఆర్ఐ రామకృష్ణ ఐదు లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందని అంచనా వేశారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే తమకు ఆర్థిక సహాయం అందించాలని బాధితులు కోరారు.

ఎకో-సెన్సిటివ్ జోన్‌గా ప్రకటించడం తగదు

ప్రజాశక్తి- రంపచోడవరం : వేముల కొండ పంచాయతీ, చెలకవీధి గ్రామంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల అధ్యక్షులు విద్యాసాగర్‌రెడ్డి మాట్లాడుతూ జీవవైవిధ్యాన్ని కాపాడాలనే ఉద్దేశ్యంతో సున్నితమైన పర్యావరణ ప్రాంతాలుగా గుర్తించి, వాటి రక్షణ కల్పిస్తూ 'గ్రామసభల్లో తీర్మానం చేయడం కోసం, అనుమతి కోసం ప్రభుత్వం,ఫారెస్ట్ అధికారులు ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఎకోసెన్సిటివ్‌జోన్‌గా ప్రకటిస్తే గిరిజను లకు అడవిమీద పూర్తిగా హక్కులేనట్టే అన్నారు. సంతకాలు పెట్టకపోతే ఎటువంటి పథకాలు ఉండవని బెదిరిస్తున్నారని ఇది సమం జసం కాదని, ఎకో సెన్సిటివ్ జోన్‌గా ప్రకటించడాన్ని మానుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలందరిని సమీకరించి పోరాడతామని పేర్కొన్నారు.

గాదెగుమ్మి జలపాతం వద్ద హెచ్చరిక బోర్డులు

ప్రజాశక్తి- కొయ్యూరు: కొయ్యూరు మండలంలో గాదెగుమ్మి జలపాతం వద్దకు ఇతర ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తున్నారు. గాదెగుమ్మి జలపాతానికి వెళ్లే రహదారిలో హెచ్చరికలతో కూడిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేశామని సిఐ శ్రీనివాసరావు, ఎస్సై కిషోర్‌వర్మ బుధవారం తెలిపారు. జలపాతానికి దగ్గరగా వెళ్లవద్దని, అప్రమత్తంగా ఉండాలని ఆ ఫ్లెక్సీలో సూచించారు.

జూదరుల అరెస్టు

ప్రజాశక్తి - కొయ్యూరు : దొడ్డవరం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నామని ఎస్సై కిషోర్‌వర్మ బుధవారం తెలిపారు. ముందస్తు సమాచారంతో తమ సిబ్బందితో దాడులు నిర్వహించామన్నారు. వారి నుంచి రూ.11,300 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

పంట కోత ప్రయోగాలపై శిక్షణ

ప్రజాశక్తి- గంగవరం: మండలంలోని అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్‌లకు ఎఒ విశ్వనాథం ఆధ్వర్యంలో పంట కోత ప్రయోగాలపై ఒకరోజు శిక్షణ నిర్వహించారు. కోతల సమయంలో ముందస్తు సమాచారం ఇవ్వాలని సిబ్బందికి ఆదేశించారు.

విఒఎ నాగలక్ష్మిపై వేధింపులు తగవు

యూనియన్ గౌరవాధ్యక్షురాలు మట్ల వాణిశ్రీ

ప్రజాశక్తి-గంగవరం: గంగవరం మండలం పిడతమామిడి విఒఎ గడ్డం నాగలక్ష్మిపై కూటమి నాయకుల రాజకీయ వేధింపులు ఆపాలని సిఐటియు అనుబంధ సంఘం విఒఎ యూనియన్ గౌరవ అధ్యక్షురాలు మట్ల వాణిశ్రీ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో మాట్లాడుతూ నాగలక్ష్మి 2018 ఆగస్టులో విధుల్లో చేరారు. దాదాపు ఏడు సంవత్సరాలుగా విఒఎగా విధులు నిర్వహిస్తూ డ్వాక్రా గ్రూపుల్ని ముందుకు నడిపిస్తోందన్నారు. సింగిరెడ్డి. ప్రసాద్,రెడ్డి, వేణు నాగలక్ష్మిపై తప్పుడు ఆరోపణలు చేస్తూ ఆమెని తొలగించాలని వేధింపులకు పాల్పడుతున్నారన్నారు. డ్వాక్రా గ్రూపులో లోన్ ఇప్పించాలని అవని పక్షంలో వ్యక్తిగత లోను నాగలక్ష్మి హామీపై ఇప్పించాలని పలుమార్లు బెదించారన్నారు. దానికి నాగలక్ష్మి ఒప్పుకోక పోవడంతో ఆమెను విఒఎగా తొలగించాలని ఎంపిడిఒకు ఫిర్యాదు చేశారు. ఎంపిడిఒ పూర్తి సమాచారం తెలుసుకోకుండా ఎపిఎంకి ఫార్వర్డ్ చేశారు. వాస్తవంగా విఒఎ అక్రమానికి పాల్పడితే సంబంధిత డ్వాక్రా గ్రూపు సభ్యులు గానీ, విఒ లీడర్లు గాని ఫిర్యాదు చేయాలి అలా కాకుండా రాజకీయ నాయకుల ఫిర్యాదును ఎంపిడిఒ ఎలా అనుమతిస్తారని ప్రశ్నించారు. పిడతమామిడి కి సంబంధించి సబ్సిడీ లోన్లు రాకపోయినా బలవంతంగా డబ్బులు వసూలు చేస్తోందని నాగలక్ష్మిపై తప్పుడు ఆరోపణలు చేయటం సరికాదని ఇప్పటికైనా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో మండలం లోని విఒఎలందరితో ఎంపిడిఒ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గంగవరం విఒఎ మండల కమిటీ సభ్యులు హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న మట్ల వాణిశ్రీ

విద్యార్థుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలి

ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

ప్రజాశక్తి- మారేడుమిల్లి: పాఠశాలల్లో విద్యార్థుల యోగ క్షేమాల పై సంబంధిత యాజమాన్యం పూర్తి బాధ్యతగా వ్యవహరించాలని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీష దేవి ఆదేశించారు. స్థానిక ఆశ్రమ బాలికోన్నత పాఠశాలను బుధవారం ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం ఈ పాఠశాలలో చదువుతున్న 8 వ తరగతి విద్యార్థిని అదృశ్యం అయినట్లు తెలుసుకున్న ఆమె హుటాహుటీన పాఠశాలను పర్యవేక్షించారు. అదశ్యం అయిన విద్యార్థిని వాళ్ళ ఇంటికి వెళ్లిందని మళ్లీ పాఠశాలకు తీసుకు వచ్చినట్లు యాజమాన్యం తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం ఉన్నా యాజమాన్యం వెంటనే స్పందించాలని లేని పక్షములో చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాల సిబ్బందికి సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థులను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. అలాగే విద్యార్థులకు అందిస్తున్న ఆహార పట్టికను పరిశీలించి ప్రభుత్వ మార్గదర్శకాలు ప్రకారం సాగాలని సూచించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వివరాలు అడిగి సంతప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ మండలం పార్టీ అధ్యక్షులు అప్పాజీ, పుత్సల గురునాథరెడ్డి, జనసేన మండలపార్టీ అధ్యక్షులు మళ్ళా దుర్గాప్రసాద్, అరకు టి ఎన్ ఎస్ ఎఫ్ సభ్యులు దూడ ప్రణీత్, తెలుగు యువత అధ్యక్షులు మళ్ళా బాలరామ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో కలసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

ఘనంగా ముగిసిన ఏకలవ్య ఉత్సవ్

ప్రజాశక్తి- మారేడుమిల్లి: ఏకలవ్య ఉత్సవ్ కార్యక్రమం మంగళవారం రాత్రి ఘనంగా ముగిసినట్టు గురుకులాల జాయింట్ కార్యదర్శి వై.వి.ఎస్. ప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 41 రకాల విభాగాల్లో విద్యార్థులకు పోటీలు ముగిశాయని రాష్ట్రం నుండి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులు వివిధ భాగాల్లో గెలుపొందిన వారందరికీ బహుమతులు అందించామన్నారు. రాష్ట్ర స్థాయి ఛాంపియన్ చింతూరు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులకు అందజేశామనాన్నరు. మారేడుమిల్లి ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ శంకర్‌ప్రసాద్ హాజరైన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు

మోతుగూడెం: మోతుగూడెం పరిధి గూడూరు పంచాయతీ తూలుకొండ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో బిర్సాముండా జయంతి నిర్వహించినట్టు హెచ్‌ఎం సుధ తెలిపారు. బిర్సా ముండా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు పార్లమెంట్ గురించి, ఫ్యాషన్ షో, డ్రాయింగ్, గిరిజన సంప్రదాయ నృత్యం, ఆటలపోటీలు నిర్వహించారు. ఆదివాసీల సంస్కృతి ఉట్టిపడేలా ఫ్యాషన్ షో నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వార్డెన్ కె కుమార్‌రావు పిడి తదితరులు పాల్గొన్నారు.



తూలుకొండ ఆశ్రమ పాఠశాలలో గిరిజనుల వేషధారణలో చిన్నారులు



వైసిపి ఏర్పాటు చేసిన నూతన కమిటీ

వైసిపి బలోపేతానికి కమిటీలు

ప్రజాశక్తి- జికెవీధి : అల్లూరి సీతారామ రాజు జిల్లా వైసిపి అధ్యక్షులు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు సూచనలు మేరకు, జీకే వీధి వైసీపీ మండల అధ్యక్షులు కంకిపాటి గిరిప్రసాద్ ఆధ్వర్యంలో, స్థానిక సర్పంచ్ బొబ్బిలి లక్ష్మి అధ్యక్షతన బుధవారం రింతాడ పంచాయతీ లో నూతన పంచాయితీ కమిటీలు ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. పార్టీ అధ్యక్షులుగా సోబోయి రామమూర్తి, మహిళా విభాగం అధ్యక్షురాలుగా కిలో ఈశ్వరమ్మ, రైతు విభాగం పంచాయతీ అధ్యక్షులు గా దేశగిరి వీరన్న పడాలు, యూత్ విభాగం పంచాయతీ అధ్యక్షులుగా కొయ్యం రాంబాబు , వాలంటీర్ విభాగం అధ్యక్షుడు గెమ్మెల కోటి బాబు , క్రిస్టియన్ విభాగం అధ్యక్షుడు పలసి చిన్నారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ప్రభుత్వ మెడికల్ కాలేజీ ల ప్రైవేటీకరణకు నిరసనగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మంత్రి లోకేష్ దృష్టికి నిర్వాసితుల సమస్య

ప్రజాశక్తి -కూనవరం : మంగళగిరి టిడిపి కేంద్ర కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్‌ని అరకు పార్లమెంట్ తెలుగు యువత అధికార ప్రతినిధి గడేసుల రంజిత్ కుమార్ బుధవారం కలిసారు. ఈ సందర్భంగా పోలవరం విలీన మండలాలైన కూనవరం, విఆర్‌పురం, చింతూరు, ఎటపాక మండలాల్లో ఉన్న పోలవరం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజ్‌లో వస్తున్న సమస్యల గురించి ఇంకా కొన్ని మండలాల్లో జరగాల్సిన భూసేకరణ గురించి వివరించారు. వరదల నుంచి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. అదేవిధంగా కూనవరం మండలంలో మొదటి కాంటూరు 41.15 పరిధిలోకి రాని పోచవరం కాచవరం పంచాయతీలను సబ్ మెర్జ్ గ్రామాలుగా గుర్తించి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ వర్తించేలా చూడాలని కోరారు. ఎటపాక మండలంలో 41.15 కాంటూరు పరిధిలోకి ఒక్క గ్రామం కూడా రాలేదని సమస్య పరిష్కరించాలని కోరారు. లోకేష్ స్పందించి శాశ్వత పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చారు.



లోకేష్‌ని కలసిన గడేసుల రంజిత్

స్టాప్ ఉంది..షెల్టర్ లేదు..



మండలంలోని కాకరపాడు మూడురోడ్ల జంక్షన్లో బస్సుషెల్టర్ లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. జాతీయ రహదారి 516ఇ నిర్మాణంలో భాగంగా పాత బస్‌షెల్టర్‌లను తొలగించి, కొత్త షెల్టర్లను నిర్మించారు. అయితే ఇక్కడ తొలగించారు తప్ప తిరిగి నిర్మించలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్‌షెల్టర్ నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

- ప్రజాశక్తి- కొయ్యూరు